

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం ప్రారంభమైన లీగ్ మ్యాచ్‌ల్లో పురుషల విభాగంలో తూర్పుగోదావరి జట్టు సాయి వైజాగ్ జట్టుపై 2-1 తేడాతో విజయం సాధించింది. కృష్ణా జిల్లా జట్టు జిఎన్ఆర్ పశ్చిమగోదావరి జట్టుపై 2-0 తేడాతో గెలుపొందింది. మహిళల విభాగంలో కృష్ణా జిల్లా జట్టు కర్నూలు జట్టుపై 2-0 తేడాతో విజయం సాధించింది. శుక్రవారం రాత్రి 11 గంటల వరకూ పోటీలు సాగాయి.

బరులు.. బేరసారాలు..!

రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకూ మామూళ్లు
పోలీసులతో నిర్వాహకులు బిజీబిజీగా మంతనాలు!
గుండాట, మూడు ముక్కలాటల నిర్వహణకూ ఏర్పాట్లు
నేటి నుంచి కోడి పందేల ప్రారంభానికి సర్వంసిద్ధం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కోడిపందేల నిర్వహణకు సంబంధించి పందేల నిర్వాహకులు పోలీసులతో బిజీబిజీగా మంతనాలు జరుపుతున్నట్లు ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. భోగి రోజు నుంచి పందేలకు ప్రభుత్వం అవకాశం ఇవ్వనుందంటూ అందుకు తగినట్లుగా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నారు. పోలీసుల నుంచి ఇబ్బందులు లేకుండా ముందుగానే మామూళ్లు ముట్టజెప్పి కట్టడి చేసేందుకు మంతనాలు సాగిస్తున్నట్లు తెలిసింది. బరుల ప్రాతిపదికన మామూళ్లను నిర్ణయిస్తున్నట్లు చెబుతున్నారు. పోలీసులకు ఇచ్చే మామూళ్లు బరుల ప్రాతిపదికన నిర్ణయించినట్లు ప్రచారం సాగుతోంది. చిన్న బరులకైతే రూ.30 వేలు, ఓ మోస్తరు బరులకు రూ.50 వేలు, పెద్ద బరులైతే రూ.లక్ష, భారీ పందేలు నిర్వహించే బరులకైతే రూ.రెండు లక్షల వరకూ సైతం మామూళ్లు నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటికే మామూళ్లకు సంబంధించిన ప్రక్రియ చాలావరకూ పూర్తయినట్లు చెబుతున్నారు. ఈ మామూళ్లు కిందిస్థాయి అధికారుల నుంచి ఉన్నతస్థాయి వరకూ వెళ్లనున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రభుత్వమే అనధికారికంగా పందేలకు అనుమతి ఇవ్వనుండటంతో నిర్వాహకులు అందుకు తగినట్లుగా ముందుగానే అన్ని చర్యలూ చేపడుతున్నారు. మామూళ్లు, ఏర్పాట్లకు సంబంధించిన సొమ్ము వసూళ్లకు నిర్వాహకులు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకున్నట్లు చెబుతున్నారు. గుండాట, మూడుముక్కలాట నిర్వాహకులు ఎంతివ్వాలి, ప్రతి పందేనికి సంబంధించి పందెం సొమ్ములో ఎంత శాతం కేటాయించాలనే నిర్ణయాలు ఇప్పటికే జరిగిపోయినట్లు చెబుతున్నారు. మోస్తరు బరులకు సంబంధించిన నిర్వాహకులు రూ.ఏడు నుంచి ఎనిమిది లక్షలు, పెద్దబరులు నిర్వాహకులైతే రూ.25 లక్షలు వరకూ మిగిలేలా ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. పెద్దబరుల వద్ద ఘర్షణలు చోటుచోసుకోకుండా బౌన్సర్లను సైతం రంగంలోకి దింపేందుకు ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో సిద్ధం చేశారు. భోగి రోజు ఉదయం 11 గంటల వరకూ పోలీసుల హడావుడి ఉంటుందని, అక్కడ నుంచి యథేచ్ఛగా సాగే అవకాశం ఉందని నిర్వాహకులే ప్రచారం చేస్తున్నారు. పందేల్లో పోటీపడే పుంజులను ఇప్పటికే అన్నిరకాలుగా సిద్ధం చేసుకుని పందెంరాయుళ్లు సిద్ధంగా ఉన్నారు. ముఖ్యంగా పండుగ రోజు భారీఎత్తున పందేలు జరగనున్నట్లు అంచనా వేస్తున్నారు.


బరులు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

ఆర్థిక స్థోమతను బట్టి బరుల ఎంపిక

తమ ఆర్థిక స్థోమతను బట్టి పందెంరాయుళ్లు ఏ బరిలో పందేల్లో పాల్గొవాలనే దానిపై నిర్ణయాలు తీసుకుంటున్నారు. ధనవంతులంతా భారీ పందేల వద్దకు క్యూ కట్టే పరిస్థితి ఉండగా, ఓ మోస్తరు పందేలు, అంతకంటే చిన్న పందేలు వేసేవారు తమతమ స్థోమతను బట్టి బరులను ఎంపిక చేసుకుంటున్నారు. సంక్రాంతి కోడి పందేల కోసం ఇప్పటికే అప్పులు చేసి మరీ సొమ్ము సిద్ధం చేసుకున్నట్లు చర్చ సాగుతోంది. పేకాటరాయుళ్ళ సైతం పెద్దఎత్తున ఆడేందుకు తోటలు, ఊరు చివర ఇళ్లలో ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిసింది. పందేలు చూసేందుకు వెళ్లేవారు గుండాట, మూడుముక్కలాటలకు ఆకర్షణకు గురై జేబులు గుల్ల చేసుకునే పరిస్థితి ఏర్పడనుంది. గుండాటలో కూడా కనీసంగా రూ.వంద ఉండేలా నిబంధనలు పెడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తే పండుగ మూడురోజులు రూ.వందల కోట్లలో బెట్టింగ్ జరగనున్నట్లు అంతా అంచనా వేస్తున్నారు.

కోడిపందేల ముసుగులో జూదాల జాతర..!



నామమాత్రంగా ఉన్న కోడిపందేల నిషేధం బ్యానర్లు

ప్రజాశక్తి - పాలకొల్లు

సంక్రాంతికి ముందు వరకూ జూద క్రీడలను కట్టడి చేస్తామని పోలీసులు హడావుడి చేయడం, పండుగ మూడు రోజులు జూదాల జాతర తరహాలో సాగడం సర్వసాధారణమైంది. ఈ తరహాలోనే ఈసారి పండుగ మూడు రోజులు జూదాల జాతరకు రంగం సిద్ధమైంది. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనుండటం ఇతర కారణాల రీత్యా ప్రభుత్వం కూడా ఈ పందేలను కట్టడి చేసే పరిస్థితి కన్పించడం లేదు. దీంతో ఈ ఏడాదీ నాలుగు రోజులపాటు కోడిపందేలు, జూదాల నిర్వహణకు ప్రభుత్వం మౌఖికంగా అనుమతిస్తున్నట్లు నిర్వాహకులు ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ పందెంరాయుళ్లు చకచకా సాగించేస్తున్నారు. షామియానా టెంట్లు సిద్ధం చేసుకోవడం దగ్గర నుంచి పోలీసులతో ఒప్పందాల వరకూ అన్నీ పూర్తయినట్లు సమాచారం. దీంతో పాలకొల్లు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో రాజకీయ విబేధాలనేవి లేకుండా పందేలను భోగి రోజు ప్రారంభించడానికి సర్వం సిద్ధమైంది. దీంతోపాటు ఆయా ప్రాంతాల్లో జనాన్ని ఆకర్షించేందుకు, రాత్రి వేళల్లో కళా ప్రదర్శనల పేరిట ఆర్కెస్ట్రాలను సైతం సిద్ధం చేస్తున్నారు. పాలకొల్లు మండలంలోని పూలపల్లి, దిగమర్రు, వడ్లవానిపాలెం, లంకలకోడేరు, తిల్లపూడి, పోడూరు మండలంలోని కవిటం, పోడూరు, పెనుమదం, గుమ్ములూరు, జిన్నూరు, యలమంచిలి మండలంలోని యలమంచిలి, కలగంపూడి, లక్ష్మీపాలెం, కొంతేరు, ఊటాడ, బూరుగుపల్లి, కాజ, లక్ష్మిపాలెం, మట్లపాలెం ప్రాంతాల్లో నిర్వహించడానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. పందేలు నిర్వహించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో రెండు రోజులుగా ఖాకీల సంచారం సైతం తగ్గింది. తాము భోగి రోజు ఉదయం వరకూ గస్తీ కాయడం, భోగి రోజున పందేలకు ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఇస్తుండటం సర్వసాధారణమైందని, దీంతో తాము చులకన అవుతున్నామని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒక్కరు ఆవేదన వ్యక్తం చేశారు.


బరులను ధ్వంసం చేస్తున్న పోలీసులు

సీసలిలో బరులు ధ్వంసం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కాళ్ల

సంక్రాంతి సందర్భంగా భారీస్థాయిలో కోడిపందేల బరులు సిద్ధం చేస్తున్నారంటూ 'ఢీ జోడి' శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనంపై కాళ్ల పోలీసులు శుక్రవారం స్పందించారు. సీసలిలో గ్రామంలో ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు పొలంలో కోడిపందేల నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను పోలీసులు అడ్డుకున్నారు. ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అల్యూమినియం తీగలను (కంచె) తొలగించారు. ఈ కార్యక్రమాన్ని కాళ్ల ఎస్ఐ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి పర్యవేక్షించారు.


వీరవాసరం - మత్స్యపురి ఆర్అండ్‌బి రహదారి (ఫైల్‌ఫొటో)


వీరవాసరం - పెనుమంట్ర ఆర్అండ్‌బి రహదారి

ఈ రోడ్లు వేసేదెన్నడో..!

అధ్వానంగా పెనుమంట్ర, మత్స్యపురి రహదారులు
ఎన్‌డిబి నిధులున్నా ప్రారంభం కాని పనులు
ప్రజలకు తప్పని ప్రయాణ కష్టాలు

ప్రజాశక్తి - వీరవాసరం

నిధులున్నా పనులు ప్రారంభించని స్థితిలో వీరవాసరం-పెనుమంట్ర ఆర్అండ్‌బి రహదారి అధ్వానంగా ఉంది. నాలుగేళ్లుగా ఈ మార్గంలో అనేక అవస్థలు పడి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నా అధికారులు ఈ రహదారి నిర్మాణంపై దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి. ఈ మార్గంలో వీరవాసరం రైల్వే గేటు నుండి సుమారు మూడు కిలోమీటర్ల వరకు పటిష్టపర్చడానికి న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డిబి) నుండి సుమారు ఐదున్నర కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు చేపట్టడానికి కాంట్రాక్టు సైతం ఖరారైంది. ప్రస్తుతమున్న రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా సర్వే పూర్తి చేసి కొన్నిచోట్ల కల్వర్టుల నిర్మాణం కూడా పూర్తి చేశారు. అయితే రోడ్డు విస్తరణ పనులు మాత్రం ఇంకా మొదలు కాలేదు. రోడ్డు విస్తరణ, అభివృద్ధికి నిధులు మంజూరవ్వడంతో అధికారులు కనీసం గోతులు కూడా పూడ్చకుండా వదిలేశారు. అదే సమయంలో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో జనాలకు కష్టాలు తప్పడం లేదు. ఏళ్ల తరబడి ఈ రహదారి విస్తరణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉన్నా అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు స్పందించకపోవడం గమనార్హం. విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో రోడ్డు వర్షాకాలంలో పెద్దపెద్ద గోతులతో నిండి ఉంటుంది. ఈ గోతుల్లో పడి అనేక మంది గాయాల పాలైన పరిస్థితీ ఉంది. ఈ ప్రాంతంలో అడపాదడపా మరమ్మతులు చేస్తున్నా కొద్దిరోజులకే మళ్లీ యథాస్థితికి చేరడంతో ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులకు కష్టాలు మాత్రం తప్పడం లేదు. ఈ రోడ్డు దుస్థితిపై స్థానిక ప్రజాప్రతినిధులు ఎన్నిసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పడం తప్ప ఒక్క అడుగూ ముందుకు పడిన పరిస్థితి లేదు. ఈ రహదారితోపాటు మండలంలోని పలు ఆర్అండ్‌బి రోడ్ల దుస్థితిపై గత రెండేళ్లలో సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర, ఆర్అండ్‌బి కార్యాలయం ముట్టడి వంటి ఆందోళనలు చేపట్టారు. అయినప్పటికీ అధికారుల నుండి స్పందన అంతంతమాత్రమే. ఇదే విధంగా వీరవాసరం-మత్స్యపురి ఆర్అండ్‌బి రహదారి పరిస్థితీ అలానే ఉంది. ఫేజ్-1లో వీరవాసరం-పెనుమంట్ర రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు పూర్తి, ఫేజ్-2లో వీరవాసరం-మత్స్యపురి రహదారి విస్తరణ పనులు పూర్తి చేస్తామని ఆర్అండ్‌బి అధికారులు చెప్పుకొస్తున్నారు. ఫేజ్-1లోని పెనుమంట్ర రోడ్డు పనులే ప్రారంభించని పరిస్థితుల్లో ఇక ఫేజ్-2లోని మత్స్యపురి రోడ్డు పనులు ప్రారంభించేదెన్నడోనని ఆ మార్గం గుండా రాకపోకలు సాగించే వారు పెదవివిరుస్తున్నారు. వీరవాసరం-పెనుమంట్ర రహదారి పనులు దక్కించుకున్న కాంట్రాక్టుదారుడు రాష్ట్రంలో అనేకచోట్ల పనులు చేస్తున్నారని, అందువల్లే ఈ పనులపై దృష్టి సారించడం లేదని సమాచారం. ఇప్పటికైనా అధికారులు ఈ రెండు రహదారుల పనులపై దృష్టి సారించి పనులు ప్రారంభించి సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్ల దుస్థితిపై వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నేతలు (ఫైల్‌ఫొటో)

కళాశాల అభివృద్ధికి సహకరిస్తా

కెనరా బ్యాంక్ ఎమ్‌డి సత్యనారాయణరాజు

ఆకివీడు: కళాశాల, విద్యార్థుల అభివృద్ధికి తమ బ్యాంకు ద్వారా పూర్తిస్థాయి సహకారం అందిస్తామని కెనరా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ కలిదిండి సత్యనారాయణరాజు చెప్పారు. మండలంలోని దుంపగడప ఎకెపిఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాన్ని కళాశాల పాలకవర్గ కార్యదర్శి నంబూరి వెంకటరామరాజుబాబు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణరాజు మాట్లాడుతూ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు పూర్తిస్థాయి సహకారం తమ బ్యాంకు ద్వారా అందజేస్తామని హామీ ఇచ్చారు. తాను గతంలో విద్యార్థి దశలో లయన్స్ క్లబ్ సహకారంతో ఉన్నత స్థితికి ఎదిగానని తెలిపారు. లయన్స్ మాజీ జిల్లా గవర్నర్లు డాక్టర్ ఎంవి.సూర్యనారాయణరాజు, చిలుకూరి కృష్ణంరాజు, డాక్టర్ పి.బలరాం ప్రతాప్‌కుమార్, పలువురు ప్రముఖులు మాట్లాడారు. అనంతరం కళాశాలలో పూర్వ విద్యార్థులు అనేకమంది కళాశాల అభివృద్ధిని ప్రస్తుతించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా అనేకమంది గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు.



మాట్లాడుతున్న దుంపగడప కళాశాల ఎమ్‌డి సత్యనారాయణ రాజు

సంక్రాంతి శుభాకాంక్షలు

కలెక్టర్ ప్రశాంతి



జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రతి కుటుంబం సుఖ సంతోషంగా జరుపుకోవాలి. ప్రజలందరూ సుఖసౌఖ్యాలు, భోగభాగ్యాలతో, రైతులు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలి.


తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

లంక భూముల్లో ఇసుక తవ్వకాలు ఆపాలి

తహశీల్దార్‌కు చించినాడ పేదల వినతి

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడలో గోదావరి పక్కన పెరుగులంక భూముల్లో ఇసుక తవ్వకాల కోసం చేస్తున్న ప్రయత్నాలను ఆపాలని తహశీల్దార్ లక్కు నరసింహారావుకు ఆ గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు కానేటి బాలరాజు, గొల్ల ఏడుకొండలు, కేతా సూర్యారావు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా పెరుగులంక భూములను గ్రామంలోని ఎస్‌సి, బిసి, ఇతర పేదలు సుమారు 400 మంది సొసైటీగా ఏర్పడి ఆ భూమిని సేద్యం చేసుకుంటున్నారన్నారు. అటువంటి భూమిలో ఇసుకను ఇళ్ల స్థలాలకు తరలించడానికి చేస్తున్న ప్రయత్నాన్ని వెంటనే ఆపాలని విజ్ఞప్తి చేశారు. అయితే హౌసింగ్ అధికారులు అక్కడి ఇసుకను ఇళ్ల స్థలాల పూడికకు తరలించడానికి కలెక్టర్, సబ్ కలెక్టర్ నుండి అనుమతి తీసుకున్నారని తహశీల్దార్ చెప్పగా పేదలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లే వరకు తవ్వకాలను నిలుపుదల చేయాలని గ్రామస్తులంతా తహశీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కేతా రాము, చెల్లుబోయిన వడ్డికాసులు, మురాల జైసింగ్, మురాల రాజేష్, సెట్టిమి భాస్కరరావు, తెన్నేటి స్టాలిన్, పల్లేరు వెంకటస్వామి, చింత చంద్రశేఖర్, మురాల రత్న ప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన జిఒ.1 ప్రతుల దహనం


జిఒ నెంబర్ 1ను దహనం చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెం.1ని వెంటనే రద్దు చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ముందుగా భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రవేశపెట్టిన జిఒ నెం.1 ప్రతులను భోగి మంటల్లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో బస్వాని ఏడుకొండలు, జోగి పండు, పంపన శ్రీకృష్ణ భగవాన్, పాలా గోపాలం, పాము శ్రీధర్, పొన్నపల్లి శివ, బల్ల శ్రీను, వెలిది పుల్లయ్య, కొల్లాటి భోగరాజు, పెచ్చెటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ సాంప్రదాయ క్రీడ

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు

ప్రజాశక్తి - ఆకివీడు

కబడ్డీ తెలుగు వారి సంప్రదాయ ఆట అని శాసనమండలి ఛైర్మన్ కె.మోషన్‌రాజు అన్నారు. దుంపగడపలో గత రెండు రోజులుగా వైసీపీ నాయకుడు కనుమూరి ఆనంద వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. ఈ పోటీలు స్త్రీలకు వేరుగా పురుషులకు వేరుగా రెండు విభాగాలుగా నిర్వహించారు. ఈ పురుషుల క్రీడలు ముగిసిన సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవం సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగువారికి గొబ్బిళ్లు, కబడ్డీ, కోడిపందేలు ఇవన్నీ సాంప్రదాయంగా వస్తున్న అంశాలని పేర్కొన్నారు. అనంతరం ప్రథమ బహుమతి గెలుచుకున్న బేతపూడి టీంకు శాసమండలి ఛైర్మన్ మోషన్‌రాజు రూ.30 వేల నగదు, మెమెంటో అందజేశారు. రెండో బహుమతి పొందిన కాళ్లపాలెం కబడ్డీ వెంకటరత్నం టీంకు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు రూ.20 వేల నగదు మెమెంటో అందజేశారు. మూడో బహుమతి గెలుపొందిన అయిభీమవరం టీంకు రూ.పది వేల, నగదు మెమెంటోను క్షత్రి కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు అందించారు.

క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయం


విజేతలకు బహుమతులు అందిస్తున్న తెలంగాణ ఎంఎల్‌సి గోరేటి వెంకన్న

ప్రజాశక్తి - మొగల్తూరు

యువత చెడు వ్యసనాల బారిన పడకుండా క్రీడల పట్ల మక్కువ పెంచుకునేలా పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ ఎంఎల్‌సి ప్రముఖ రచయిత, ప్రజా గాయకుడు గోరేటి వెంకన్న సూచించారు. జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముత్యాలపల్లిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వన్నె కుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బంధన పూర్ణచంద్రరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రామీణ క్రీడలైన కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడల్లో నైపుణ్యత సాధించి యువత జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వేములదీవి జట్టుకు నగదు బహుమతి రూ.15 వేలు, ద్వితీయ స్థానం సాధించిన ముత్యాలపల్లి జట్టుకు రూ.10 వేలు, తృతీయ స్థానం సాధించిన మొగల్తూరు జట్టుకు రూ.6 వేలు, నాలుగో స్థానం సాధించిన వారతిప్ప జట్టుకు రూ.5 వేల నగదు బహుమతి అందజేశారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన మహిళలకు రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.3 వేలు, తృతీయ స్థానం సాధించిన వారికి రూ.1,500 నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయులు వర్ధిల్లి వెంకటేశ్వరరావు, రాష్ట్ర వన్నెకుల కార్పొరేషన్ డైరెక్టర్ బందన పూర్ణ చంద్రరావు, జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, నిర్వాహకులు కొల్లాటి రామారావు, రేవు రాంబాబు, కర్రి వీరాస్వామి పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నేడు, రేపు వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పొలమూరులో 35వ సంక్రాంతి యువజనోత్సవాల సందర్భంగా కలిదిండి సూర్యనారాయణరాజు జన విజ్ఞాన కళా వేదిక వద్ద, హైస్కూల్ ఆవరణలో ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా యువజన సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి మావో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో హైస్కూల్ గ్రౌండ్‌లో జరగనున్న వాలీబాల్ పోటీలను జయప్రదం చేయాలని కోరారు. ఈ పోటీలు పేకాట, కోడిపందేలు వంటి జూద క్రీడలకు వ్యతిరేకంగా జరుగుతున్నాయని తెలిపారు. యువత పెడదారి పట్టకుండా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతకే కాకుండా మహిళలకు కూడా పండగ మూడు రోజులు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.


దుకాణంలో భోగి పిడకల దండలు అమ్ముతున్న వ్యాపారి

దుకాణాల్లో భోగి పిడకల అమ్మకాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

గతంలో సంక్రాంతి పండగకు ముందు యువత భోగి మంటలో భోగి పిడకలు వేసేవారు. దీనికోసం ఆవుపేడ సేకరించి భోగి పిడకలు తయారు చేసేవారు. అయితే ప్రస్తుత ఆధునిక కాలంలో బిజీ అయిపోయి పిడకలు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. దీంతో భోగి పిడకలు దుకాణాల్లో అమ్మే పరిస్థితి వచ్చింది. గత కొన్ని సంవత్సరాలుగా మార్కెట్లో భోగి పిడకలు తోపుడు బండ్లపై అమ్మేవారు. అయితే కొంతమంది భోగిమంటలలో కచ్చితంగా భోగి పిడకలు వేస్తున్న నేపథ్యంలో పట్టణంలో చిన్న దుకాణాల్లో అమ్ముతున్నారు. ప్రస్తుతం పిడకల దండ రూ. 50 నుంచి రూ.వంద వరకూ అమ్ముతున్నారు. అయినా వీటికి మంచి గిరాకీ ఉంటోంది.


వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న మాజీ ఎఎంసి ఛైర్మన్ ఇందిరా సీతారామ్

కొడమంచిలిలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

యువకులంతా చెడు మార్గం వైపు వెళ్లకుండా ఉండేందుకు గ్రామాల్లో ఇటువంటి క్రీడలు ఎంతోగానో ఉపయోగపడతాయని ఎస్ఐ ప్రసాద్ అన్నారు. మండలంలోని కొడమంచిలి, వల్లూరు, పెనుమంచిలి గ్రామాల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా వాలీబాల్, క్రికెట్, కబడ్డీ టోర్నమెంట్‌ను శనివారం కొడమంచిలి ఉన్నత పాఠశాలలో మాజీ ఎఎంసి ఛైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్ ప్రారంభించారు. యువత వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండేందుకు ఇటువంటి క్రీడా టోర్నమెంట్లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, వల్లూరు సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు, పెనుమంచిలి సర్పంచి గణేశుల శేషవాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ రామచంద్రరావు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - పాలకోడేరు

సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామచంద్రరావు అన్నారు. విస్సాకోడేరులో శుక్రవారం గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామచంద్రరావు మాట్లాడుతూ సంక్రాంతి ముసుగులో కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఆర్ఐ నాగభూషణరావు, కార్యదర్శులు జార్జి ప్రసాద్, పెద్దిరాజు, విఆర్ఒ పుల్లయ్య, మహిళా పోలీసులు శ్రీదేవి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మహిళా మెడలో బంగారం గొలుసు తెంపుకుని వెళ్లిన సంఘటన గురువారం సాయంత్రం పెనుమంట్ర పల్లపు వీధిలో జరిగింది. స్థానిక పల్లపువీధిలో సత్తి నాగలక్ష్మి చంద్రకళ కుళాయి నీరు పట్టుకునేందుకు ఇంటి నుండి బయటకొచ్చింది. ఈ తరుణంలో ఒంగి నీరు పడుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి బైక్ పై వచ్చి మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని వెళ్లినట్లు ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ తెలిపారు. సుమారు ఒకటిన్నర కాసు ఉంటుందని అన్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిండుతుడిని పట్టుకుంటామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


పూలు కొంటున్న యువతి

పూల ధరకు రెక్కలు!

వినియోగదారుల బెంబేలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పండగ సీజన్‌లో పూలకు మంచి డిమాండ్ ఉంటుంది. అందులోనూ సంక్రాంతి పండుగ అంటే పూల ఆకాశాన్నంటుతాయి. దీంతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలోని మార్టేరు సెంటర్లో పూల వ్యాపారాలు జోరందుకున్నాయి. బ్రాహ్మణ చెరువులో, మార్టేరు సెంటర్లో పూల దుకాణాలు ఉన్నాయి. మార్టేరులో పది సంవత్సరాలుగా ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి పూల వ్యాపారం చేస్తుంటారు. గతేడాదితో పోల్చితే ఈ సంక్రాంతి పండుగలో పూల వ్యాపారం జోరుగా ఉందని తెలిపారు. ముఖ్యంగా చామంతి పూలు ఇటీవల కేజీ రూ.120 నుంచి రూ.130 పలుకగా, ప్రస్తుతం రూ.200లకు విక్రయిస్తున్నారు. అలాగే బంతి మామూలు రోజుల్లో అయితే కేజీ రూ.80 నుంచి రూ.100 పలికితే ప్రస్తుతం రూ.150 పలుకుతోంది. మూర కనకాంబరాలు కేజీ రూ.2000లకు విక్రయిస్తున్నారు. లిల్లీ పూలు ప్రస్తుతం రూ.300లకు విక్రయిస్తున్నారు.

గ్రామాల్లో గంగిరెద్దుల సందడి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రామాల్లో గంగిరెద్దుల సందడి నెలకొంది. గంగిరెద్దులను ఆడించే వారు గ్రామాల్లో సంచరిస్తూ అయ్యగారికి దండం పెట్టు.. అమ్మగారికి దండం పెట్టు.. అంటూ ఇంటి యజమాని, కుటుంబ సభ్యులను పొగుడుతూ, అంతా చల్లగా ఉండాలని దీవిస్తారు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు గ్రామీణ ప్రాంతాల్లో సందడే సందడి. గంగిరెద్దులను అందంగా అలంకరించి


గ్రామాల్లో గంగిరెద్దుల విన్యాసాలు

ఒంటిపై దుస్తులు వేస్తారు. ప్రతి ఇంటి ముందూ గంగిరెద్దులతో విన్యాసాలు చేయిస్తారు. దీంతో స్థానికులు ఎవరికితోచింది వారు ఇస్తారు. ముఖ్యంగా బ్రాహ్మణచెరువు, అత్తిలికి చెందిన కొంతమందికి ఇదే జీవనాధారం. వీరు పెనుమంట్ర, నత్తారామేశ్వరం, పోలమూరు, అత్తిలి, మంచిలి, ఆల్లిపాడు, నౌడూరు, కోడేరువాడ, బ్రాహ్మణచెరువుతో పాటు పలు గ్రామాలకు వెళ్తుంటారు. సంక్రాంతి రోజుల్లోనే వీరు నాలుగు రాళ్లు వెనకేసుకుంటారు. తరువాత వీరికి ఉపాధి ఉండదు. ప్రతి ఇంటి వద్దా ఆటాడితే రూ.20 నుంచి రూ.100 వరకూ వస్తుంది.

విస్సాకోడేరులో డిపిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ పర్యటన

సర్పంచితో కలిసి డంపింగ్ యార్డు పరిశీలన

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలం పరిధిలోని విస్సాకోడేరులో డిపిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ శిరీష వారి బృందంతో కలిసి శుక్రవారం పర్యటించారు. పంచాయతీ సర్పంచి బొల్ల శ్రీనివాస్‌తో కలిసి గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా విస్సాకోడేరులో డంపింగ్ యార్డు (ఎస్‌డబ్ల్యుసిపిసి) షెడ్డును సర్పంచి శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకొని అత్యాధునిక పద్ధతిలో తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో ఈ డంపింగ్ యార్డును పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు జిల్లాలోనే ఈ డంపింగ్ షెడ్డును లోకల్ ట్రెయినింగ్ సెంటర్‌గా ఎంపిక చేశారు. దీనిలో భాగంగా బిపిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ శిరీష డంపింగ్ యార్డుతోపాటు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికంగా ఏర్పాటుచేసిన డబ్బింగ్ షెడ్డుతో పాటు తడి, పొడి చెత్త వేరు చేసే విధానం, వర్మీ కంపోస్ట్ తయారీ, ఆకు, కాయగూరల పెంపకం, వాటి ద్వారా వచ్చే ఆదాయ వనరులపై క్షుణ్ణంగా పరిశీలించి సర్పంచి శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే డంపింగ్ యార్డు ప్రాంతంలో నాటిన పండ్లు, పూల మొక్కల పెంపకాన్ని చూసి సర్పంచి శ్రీనివాస్‌ను అభినందించారు. డంపింగ్ యార్డు నిర్వహణ, చుట్టూ ఉన్న ఆహ్లాదకర ప్రాంతాన్ని పరిశీలించిన జిల్లా కోఆర్డినేటర్ శిరీష వారి బందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఎస్‌డబ్ల్యుసిపిసి షెడ్ల నిర్మాణం, వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా గ్రామంలో డంపింగ్ షెడ్డును అధునాతన పద్ధతిలో నిర్వహించడం అభినందనీయమన్నారు. సర్పంచి


డంపింగ్ యార్డు షెడ్డును పరిశీలిస్తున్న డిపిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ శిరీష, సర్పంచి శ్రీనివాస్

బొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ డంపింగ్ యార్డు నిర్మాణంతో గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న పారిశుధ్య సమస్యను పరిష్కరించామని చెప్పారు. గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వైసిపి ప్రభుత్వం, ప్రభుత్వ అధికారుల సహకారంతో డంపింగ్ షెడ్డును నిర్మించి నిర్వహిస్తున్నామని తెలిపారు.


పేద మహిళకు తోపుడు బండిఅందజేస్తున్న యడ్ల తాతాజీ

మహిళకు తాతాజీ తోపుడు బండి అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక నాలుగో వార్డు చైతన్య హాస్పిటల్ ప్రాంతంలో నివసిస్తున్న క్రొవ్విడి లక్ష్మీనరసమ్మకు ఉపాధి నిమిత్తం డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ శుక్రవారం తోపుడు బండి అందజేశారు. లక్ష్మీనరసమ్మ భర్త రెండేళ్ల క్రితం మృతి చెందడంతో జీవనోపాధి నిమిత్తం పూరి గుడిసెలో ఉంటున్న ఆమె అక్కడే ఎండలో చిన్న టిఫిన్ సెంటర్ నడుపుతుండటాన్ని కొద్ది రోజుల క్రితం చూసిన తాతాజీ తోపుడు బండి ఇస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం బండిని వారింటికి తీసుకెళ్లి లక్ష్మీనరసమ్మకు అందజేశారు. కార్యక్రమంలో నేతలు తలుపూరి భుజంగరావు, అంజూర్తి శ్రీను, కాసా నానాజి, మోర్త గిరీష్, రాజారెడ్డి, కొరగింజల శ్రీను, చెన్ను విజయ్, రేలంగి శ్రీను, పెచ్చెట్టి కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇ-పంట నమోదు చేయించుకోవాలి : ఎడిఎ

ప్రజాశక్తి - మొగల్తూరు

రబీ సాగులో ప్రతి ఒక్కరూ ఇ-పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఎడిఎ ఇ.అనిల్‌కుమారి సూచించారు. శుక్రవారం మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి వైస్ ఛైర్మన్ కంచర్ల నరసింహ అధ్యక్షతన నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతలకు అవసరమైన ఎరువులను ఆయా కేంద్రాల్లో ఉంచామన్నారు. గ్రామాల్లో నీటి సమస్యను ఇరిగేషన్ అధికారులు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ జెడ్‌పిటిసి తిరుమల బాపూజీ, ఎంపిడిఒ ఆర్‌సి ఆనంద్‌కుమార్, తహశీల్దార్ అనిత కుమారి, వ్యవసాయ అధికారి ఎం.సుజాత, పశువైద్యాధికారిని జి.నీలిమ, రైతులు ఆముదాలపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి సభ్యులు

సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ

సర్పంచులు శివాజీ రాజు, అనూష సత్యనారాయణ

ప్రజాశక్తి - పాలకోడేరు

భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని గొరగనమూడి, పెన్నాడ అగ్రహారం సర్పంచులు గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు), చిల్లా అనూష సత్యనారాయణ అన్నారు. గొరగనమూడిలో గొరగనమూడిపాలెం కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు పోటీలతోపాటు యువతకు క్రికెట్, వాలీబాల్, పరుగుపందెం పోటీలు నిర్వహించారు. పెన్నాడలో పంచాయతీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి భోగిమంట వేశారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన మహిళలకు, యువతీ యువకులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ సంక్రాంతి పండగ నేపథ్యంలో సంప్రదాయ క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా వీటిని కొనసాగించే విధంగా అంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచి గూడూరి ఆంజనేయులు, కార్యదర్శి లక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.


పాలకోడేరు :మహిళకు బహుమతి ప్రదానం చేస్తున్న సర్పంచి శివాజీ రాజు

అత్తిలి :ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి మక్కా సూర్యారావు ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటను వెలిగించి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వివివిఎస్ రామారావు, ఎంపిటిసి సభ్యులు, ఇఒపిఆర్‌డి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాళ్ల : మాలవానితిప్పలోని అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొబ్బెమ్మలు పెట్టి రంగవల్లులు తీర్చిదిద్ది, నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వేగేశ్న పద్మ, ఆయా డి.విజయ పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎల్‌సి మంతెన పుట్టినరోజు

ప్రజాశక్తి - ఉండి

టిడిపి సీనియర్ నాయకుడు, శాసనమండలి సభ్యులు మంతెన వెంకట సత్యనారాయణ రాజు (పాందువ్వ శ్రీను) పుట్టినరోజు వేడుకలు శుక్రవారం పాందువ్వలో ఆయన స్వగృహం వద్ద టిడిపి నాయకులు, అభిమానులు కార్యకర్తలు గ్రామస్తుల నడుమ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మంతెన వెంకట సత్యనారాయణ రాజు టిడిపిని నియోజకవర్గంలోనే కాకుండా, రాష్ట్రంలోనూ పార్టీ జెండా ఎగరవేసేందుకు తన వంతు కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజా సమస్యలపై శాసనమండలిలో తనదైన శైలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఉన్న సాన్నిహిత్యం వల్ల గత ప్రభుత్వ హయాంలో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో తన వంతు కృషి చేశారని గుర్తు చేశారు. అనంతరం కేక్ కట్ చేయించి ఆయనకు తినిపిస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఎంఎల్‌సి వెంకట సత్యనారాయణ రాజు

ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు వెనుకంజ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో తేమ శాతం నిర్ధారణలో నెలకొన్న గందరగోళం వల్ల మిల్లర్లు వెనుకంజ వేశారని వ్యవసాయ సలహా మండలి వైస్ చైర్మన్ కొవ్వూరి రామకృష్ణ సూర్య సత్యనారాయణ రెడ్డి (చిన్నారెడ్డి) అన్నారు. జుత్తిగ రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం ఎఒ మద్దాల జయ దుర్గామాధురి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన విషయాలను జిల్లా స్థాయికి పంపుతామని తెలిపారు. దీనివల్ల రైతుల నుంచి తీసుకెళ్లిన ధాన్యం దిగుమతికి ఎక్కువ సమయం పడుతుందన్నారు. అలా కాకుండా దగ్గరలోని రైస్ మిల్లులకు రబీ ధాన్యం పంపాలని తెలిపారు. ఎఒ మద్దాల జయ దుర్గా మాధురి మాట్లాడుతూ రైతులు తొందరగా పనులన్నీ వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తమనంపూడి వీర్రెడ్డి, పశువైద్యాధికారి జి.వరలక్ష్మి పాల్గొన్నారు.

క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యాన ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఉండి

ఆత్మీయ సమ్మేళనాల ద్వారా స్నేహ బంధాలు, బంధుత్వాలు మెరుగవుతాయని కోలమూరు గ్రామ సర్పంచి, ఉప సర్పంచులు నడింపల్లి సత్యవతి, నడింపల్లి రాంబాబు రాజు అన్నారు. శుక్రవారం కోలమూరులో ఉప సర్పంచి నడింపల్లి రాంబాబు రాజు ఆధ్వర్యంలో క్షత్రియ సంక్షేమ సమితి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నడింపల్లి రాంబాబురాజు, పేరిచర్ల సుభాష్ రాజు, గంద్రాజు రాజేష్ వర్మ మాట్లాడుతూ గత మూడు తరాలకు సంబంధించి గ్రామంలోని క్షత్రియులు వివిధ కారణాలతో పలు ప్రాంతాలకు వెళ్లిపోయారని. వారందరినీ సంక్రాంతి సందర్భంగా సమీకరించి ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమాల్లో మహిళలు, చిన్నారులు ఉల్లాసంగా పాల్గొని ఆటపాటలు, నత్యాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారని వారు తెలిపారు. సుమారు 1500 మంది హాజరయ్యారని, ప్రతి సంవత్సరం సంక్రాంతి సంబరాలలో భాగంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని వారు సూచించారు.


ఇల్లు కాలిపోవడంతో నిరాశ్రయులైన బాధితులు

రెండు తాటాకిళ్లు దగ్ధం

ప్రజాశక్తి - ఉండి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో రెండు తాటాకిళ్లు దగ్ధమైన సంఘటన ఉప్పులూరు గ్రామంలో జరిగింది. దీనికి సంబంధించి అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పులూరు గ్రామంలోని లైబ్రరీ వీధిలో నివాసం ఉంటున్న గంధం సాయిబాబు తన ఇంటి నిర్మాణం నిమిత్తం పక్కనే చిన్న తాటాకిల్లు వేసుకుని అందులో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఒక్కసారిగా మంటలు రేగడంతో ఇల్లు మొత్తం కాలిపోయిందని, అలాగే పక్కనే ఉన్న గంధం నాగేశ్వరరావు ఇల్లు కూడా దగ్ధమైందని, సుమారు రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని అధికారులు తెలిపారు. ఆ సమయంలో చుట్టుపక్కల వారు ఆకివీడు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా ఫైర్‌ఆఫీసర్ వై.నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకునేసరికి ఇల్లు మొత్తం కాలి బూడిదైందని బాధితులు వాపోయారు. ఈ ఘటనలో ఆకివీడు ఫైర్ స్టేషన్ సిబ్బంది కెవి.సత్యనారాయణ, జి.రమేష్, ఎ.రియాన్, జె.త్రిమూర్తులు పాల్గొన్నారు.

8 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

సంక్రాంతి పేరుతో ఏ విధమైన కోడిపందేలు, గుండాటలకు అనుమతి లేదని రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. 8 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. పండుగను సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఎవరు పాల్పడినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

అరుణ్‌ప్రసాద్‌కు కృత్రిమ కాలు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

సీతారామపురం సౌత్ గ్రామానికి చెందిన అరుణ్‌ప్రసాద్‌కు కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృత్రిమ కాలును కొవ్వలి ఫౌండేషన్ ట్రెజరర్ జయలక్ష్మి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ 11 ఏళ్ల క్రితం వెంపలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తూ అరుణ్‌ప్రసాద్ కాలు పోగొట్టుకున్నాడన్నారు. కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు సూచనలు మేరకు అరుణ్ ప్రసాద్‌కు రూ.20 వేలతో ప్రత్యేకంగా కృత్రిమ కాలును తయారు చేయించి అందించామన్నారు. ఆపదలో ఉన్నవారికి కొవ్వలి ఫౌండేషన్ ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో సంకు భాస్కర నాయుడు, గ్రంధి లక్ష్మి నాయుడు, రాట్నాల రామారావు, బర్రె మురళీ పాల్గొన్నారు.


అరుణ్ ప్రసాదడ్‌కు కృత్రిమ కాలు అందజేస్తున్న కొవ్వలి ఫౌండేషన్


రాయకుదురులో కలుసుకున్న పూర్వపు విద్యార్థులు

రాయకుదురులో అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి - వీరవాసరం

హాయ్.. ఎలా ఉన్నావ్.. బాగున్నావా.. నిన్ను చూసి చాలా రోజులైంది.. నువ్వు అస్సలు మారలేదు.. ఇప్పుడు ఏం చేస్తున్నావంటూ ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆత్మీయ వాతావరణంలో కలుసుకున్నారా మిత్రులు. రాయకుదురు ఉన్నత పాఠశాలలో 1992 - 93 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుండి పదో తరగతి వరకూ చదువుకున్న విద్యార్థులు కలుసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో తామంతా కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. పాఠశాలలో గడిపిన క్షణాలు, ఉపాధ్యాయులతో ఉన్న బంధాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అలనాటి విద్యార్థులు కెఎస్ఆర్‌కె.గోపాలకృష్ణ, ఎ.చంద్రశేఖరరావు, ఎల్లా వెంకటేశ్వరరావు, కటికరెడ్డి శ్రీరామ్మూర్తి, పచ్చిగోళ్ల శ్రీనివాసగుప్త, ఆకుల రామారావు, కొప్పుల శ్రీను పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఆచంట

భవన నిర్మాణ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, గుర్తింపు కార్డులివ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో జిల్లా ఉపాధ్యక్షులు కేతా నాగాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ నిర్మాణరంగ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.198 కోట్లు కేటాయించిందని, ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా స్వాహా చేసిందని విమర్శించారు. కార్మికులకు చెందాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చట్టవిరుద్ధంగా సొంత అవసరాలకు వాడుకోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల సభ్యత్వం ద్వారా జమ చేయబడ్డ సెస్ నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం వాడుకోవడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ ఇసుక కొరత వల్ల రాష్ట్రంలోని దాదాపు 50 మందికిపైగా భవన నిర్మాణ కార్మికులు ఉపాధి పనుల్లేక తీవ్రమైన ఆకలి అప్పులతో ఆత్మహత్యలకు పాల్పడ్డారని, వారి కుటుంబాలకు దిక్కెవరని ప్రశ్నించారు. 60 సంవత్సరాలు వచ్చాక ఏదేని కారణం వల్ల చనిపోయిన భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం తక్షణ సాయం కింద రూ.లక్ష ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు సానబోయిన సత్తిపండు, తానేలంక లక్ష్మీనారాయణ, పొన్నాడ ఆచార్యులు, బొలిశెట్టి సత్యనారాయణ, కొమ్ముల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.